క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలందించండి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

పాణ్యం: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని నంద్యాల జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆరోగ్య సర్వేను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గడివేముల: మండలంలోని మంచాలకట్ట రహదారిలోని తలముడిపి బాట సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల వివరాల మేరకు..ఎల్‌కే తండా గ్రామానికి చెందిన రాములునాయక్, మనోహర్‌నాయక్ సొంత పనుల నిమిత్తం బైక్‌పై గడివేములకు వచ్చి తిరిగి వెళ్తుండగా తలముడిపి బాట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ప్రమాదంలో బైకుపై వస్తున్న వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో మెరుగైన వైద్య సేవల నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

వైభవంగా రంగస్వామి కల్యాణం

గడివేముల: ఒండుట్ల గ్రామం సమీపంలోని ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీలక్ష్మీ సమేత రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు నర్సయ్యస్వామి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గణపతిపూజ, పుణ్యాహ వాచనం, కలశస్థాపన వంటి పూజల అనంతరం కల్యాణం జరిపించారు. వేడుకను తిలకించేందుకు వందలాదిగా భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు పల్లకీసేవ చేపట్టారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



రంగల్‌దర్వేశ్ ఖాద్రిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: మండలంలోని ఒండుట్ల గ్రామం సమీపంలో వెలసిన శ్రీలక్ష్మీరంగనాయక, రంగల్‌దర్వేశ్ ఖాద్రి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. స్వామివార్ల తిరునాల సందర్భంగా ఎమ్మెల్యే మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రంగస్వామి,రంగల్‌దర్వేశ్‌ఖాద్రి స్వామివార్లను కులమతాలకు అతీతంగా దర్శించుకోవడం విశేషమన్నారు. ఉత్సవాలకు వచ్చిన ప్రతి భక్తుడు రంగల్‌దర్వేశ్‌ఖాద్రి, రంగస్వామిలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. తదనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ నాగమద్దమ్మ, వైస్ ఎంపీపీ కాలునాయక్, సర్పంచ్ కత్తి తులశమ్మ, ఉపసర్పంచ్ శివానందరెడ్డి, చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సుంకేసులకు 1,120 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి మంగళవారం 1,120 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉందని అధికారులు తెలిపారు. డ్యాంలో 0.782 టీఎంసీల నీటి నిల్వ ఉందని, కేసీ కాల్వకు 935 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నామని చెప్పారు.

కోలుకోలేక యువతి మృతి

పాణ్యం: మండలంలోని గోరుకల్లు గ్రామానికి చెందిన దీపిక కోలుకోలేక మృతి చెందిందని ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 5వ తేదీన తల్లి మందలించిందని దీపిక ఇంట్లో ఉన్న బాత్‌రూంను శుభ్రం చేసే రసాయనాన్ని సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాలకు తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందిందిరు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బాధ్యతకు చిరునామా.. ఆమె

- నడవలేని స్థితిలో భర్త
- సపర్యలు చేస్తున్న సహచరి
- హెచ్‌ఎం గానూ బాధ్యతల నిర్వహణ
- భార్యాభర్తల బంధానికి నిదర్శనం విమలమ్మ దంపతులు



గడివేముల: భూదేవికి ఉన్నంత ఓర్పు, సహనం మహిళలకు ఉంటుందని పెద్దలు చెప్పింది ఇక్కడ అక్షర సత్యమైంది.తల్లిగా, ఇల్లాలుగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది విమలమ్మ. అ నారోగ్యంతో నడవలేని భర్తతో అడుగులేయిస్తుంది.. ఆకలేస్తే అమ్మలా గోరుముద్దలు తినిపిస్తుంది.. ఇంట్లో ఇద్దరే ఉంటుండటంతో తనకు తోడు ఎవరూ ఉండరనే కారణంతో కారులో పాఠశాల వద్దకు తీసుకెళ్లి వృత్తి ధర్మం నిర్వర్తిస్తూనే భర్తను కంటికి రెప్పలా కాపాడు తూ సహధర్మచారిణి అనే పదానికి అర్థంగా నిలిచింది.

కర్నూలుకు చెందిన విమల వసుంధర దేవి ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుండగా నంద్యాల మండలం పులిమద్దికి చెందిన అరవింద పంచరత్నంతో 1983 ఆగస్టులో పెళ్లయ్యింది. వారు నంద్యాలలో స్థిరపడ్డారు. భర్త స్వగ్రామమైన పులిమద్దిలోనూ పనిచేసింది. పదేళ్లపాటు అక్కడ విధులు నిర్వర్తించింది. అనంతరం గడిగరేవుల ఉన్నత పాఠశాలకు రెండేళ్ల క్రితం బదిలీ అయ్యింది. భర్త తన స్వగ్రామానికి వెళ్లి వ్యవసాయ పనులు చూసుకుండేవాడు. వీరికి ఒక కుమారుడుతో పాటు ఇద్దరు కుమార్తెలు. వీరిలో ఒక కుమార్తె డాక్టర్‌గా, మరో కుమార్తె, కుమారుడు బ్యాంకు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వారికి పెళ్లిళ్లు సైతం చేశారు. అంతా బాగుంది అనుకుంటున్న తరుణంలో పంచరత్నం షుగర్ వ్యాధి బారిన పడ్డాడు. వ్యాధి తీవ్రం కావడంతో కాళ్లు చేతులు సచ్చుబడి నడవలేని స్థితికి వెళ్లడంతో ఎడమ కాలును తొలగించారు. అప్పటి నుంచి నడవలేని స్థితిలో ఉన్న భర్తకు అన్నీ తానైంది విమల. వృత్తి రీత్యా హెచ్‌ఎం కావడంతో విధి నిర్వహణతో పాటు ఇల్లాలిగా భర్తకు సేవలు చేస్తూ కంటికి రెప్పలా కాపాడుతోంది. ప్రస్తుతం ఆమె గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నపాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. వారి పిల్లలు వివిధ ప్రాంతాల్లో స్థిరపడటంతో కారులో తన వెంటే పాఠశాలకు తీసుకెళ్తూ వృత్తి ధర్మంతో పాటు భర్త ఆలన, పాలన చూస్తోంది.



ఆయన వెంటే నేను



అగ్నిసాక్షిగా ఒక్కటయ్యాము. నన్ను కంటికి రెప్పలా చూసుకున్నారు. ఏ కష్టం వచ్చినా అండగా నిలిచారు. దేవుడి చిన్నచూపు చూడటంతో ఆయన అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో కాలు తొలగించారు. అయినప్పటికీ ఆయన మీద ప్రేమ తగ్గదు లేదు.

– విమలా వసుంధరా దేవి, హెచ్‌ఎం, జెడ్పీ హై స్కూల్, గడిగరేవుల

ఆత్మస్థైర్యం నడిపించింది

ఓర్వకల్లు: ఈమె పేరు రాజేశ్వరమ్మ, పాలకొలను గ్రామం. ఓర్వకల్లు మండలం. గ్రామానికి చెందిన సువర్ణమ్మ, నారాయణశెట్టి దంపతుల కుమార్తె. వీరికి ఒక కుమారుడు, కూతురు సంతానం. దంపతులు ఇద్దరు గ్రామంలో చిన్నపాటి కిరాణం దుకాణం పెట్టుకొని జీవనం సాగించేవారు. పిల్లలు పెద్దయ్యాక కుమారుడు కర్నూలు నగరంలో కిరాణా దుకాణం పెట్టుకొని స్థిరపడ్డాడు. కూతురైన రాజేశ్వరికి చిన్న తనంలోనే పోలియో సోకి రెండు కాళ్లు చచ్చుపడి పోయాయి. ఐదేళ్ల కిత్రం తండ్రి మృతి చెందాడు. దీంతో రాజేశ్వరమ్మ భారం తల్లి సువర్ణమ్మ మీద పడింది. దిక్కుతోచని స్థితిలో వున్న సువర్ణమ్మ పొదుపు సంఘంలో చేరి కూతురును పెంచి పెద్దచేసింది. ఈ క్రమంలో తల్లికి వయస్సు మీదపడడంతో ఆమె పోషణ కూతురు రాజేశ్వరి తీసుకుంది. తాను దివ్యాంగురాలైనప్పటికీ ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసింది. తల్లి కోసం పెళ్లి సైతం చేసుకోలేదు. స్వయం ఉపాధి కోసం నాలుగేళ్ల క్రితం శ్రీలక్ష్మి గ్రూపులో సభ్యురాలుగా చేరింది. మొదట బ్యాంకులో రూ.లక్ష రుణం తీసుకొని చీరల వ్యాపారం మొదలుపెట్టింది. వ్యాపారం బాగా జరగడంతో స్త్రీనిధి కింద మరో రూ.50 వేలు అప్పు తీసుకొని చిన్నపాటి కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకుంది.



జగనన్న తోడు కింద ఏడాదికి రూ.10 వేలు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందుతోంది. రెండు వ్యాపారాలు నిర్వహించుకుంటూ తల్లిని కంటికి రెప్పలా చూసుకుంటోంది.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్‌ను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని



కోడుమూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గడివేముల: స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ ఎ.మధుసూదన్‌ను అఖండ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక రాజరాజేశ్వరి పాఠశాలలో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచిన తీరును వివరించారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, ఎంపీటీసీలు వంగాల మహేశ్వరరెడ్డి, తలారి మద్దమ్మ, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు నాగేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి,సుంకన్న పాల్గొన్నారు.

గూడూరు: ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లాం, బోయ లక్ష్మన్న, పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు,కౌన్సిలర్లు కలాం, ఖలీల్, దస్తగిరి, కుమార్, నంద కిషోర్, విజయుడు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కోరారు. మంగళవారం వైస్ చైర్మన్ భీమిరెడ్డితో కలిసి మండలంలోని అమడగుంట్ల, ఎర్రదొడ్డి, అనుగొండ, గోరంట్ల, వెంకటగిరి,కోడుమూరు, వర్కూరు, కల్లపరి, పులకుర్తి గ్రామ సచివాలయాలను సందర్శించి రవీంద్రారెడ్డిని గెలిపించాలంటూ ప్రచారం చేశారు.గోరంట్ల, ఎర్రదొడ్డి గ్రామాల సర్పంచులు బాలకృష్ణ, మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ తిరుపతయ్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఇమ్మానేయులు, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, బలరాం, చంద్రశేఖర్ రెడ్డి, ప్రహ్లాదరెడ్డి, అయ్యప్ప తదితరులున్నారు.

పాణ్యం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యులు, గ్రామాల నాయకులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, కరుణాకర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, బాబు, పుల్లారెడ్డి, భాస్కర్, కృష్ణారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మనోహర్, శేషిరెడ్డి, సారంగపాణి, కరుణాకర్, రాజన్న, భాస్కర్ రెడ్డి, బాలిరెడ్డి, శేషారెడ్డి, రామచంద్రుడు, సత్యాలు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు

- విజేతగా నిలిచిన ఎస్.కొత్తూరు వృషభాలు

సి.బెళగల్: పోలకల్ గ్రామంలో చెన్నసోమేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పాలపళ్ల ఎద్దులు బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీల్లో జిల్లాలోని పలుప్రాంతాల నుంచి 19 జతలు ఎద్దులు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఇందులో తొలి 5 స్థానాలలో నిలిచిన ఎద్దులకు వరుసగా రూ.40 వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను దాతలు బుధవారం అందజేయనున్నారు.

విజేతగా నిలిచిన ఎస్. కొత్తూరు ఎద్దులు..

పోటీలలో 5,677 అడుగుల దూరం లాగిన నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్. కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణేశ్వరరెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో, గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామానికి చెందిన సీతారాముడు, చెవిటి సుంకన్న ఎద్దులు సంయుక్తంగా రెండో స్థానంలో, ఆ తరువాతి స్థానాల్లో నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం డి. రంగాపురం గ్రామానికి చెందిన జూటూరు మహేంద్ర రెడ్డి ఎద్దులు, నాగర్ కర్నూల్ జిల్లా తాండూరు గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్, నంద్యాల జిల్లా క్రాంతినగర్‌కు చెందిన భావనారెడ్డి సంయుక్త ఎద్దులు నాల్గవ స్థానంలో స్థానంలో, కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన తలారి రామచంద్రుడు ఎద్దులు ఐదో స్థానంలో నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే గ్రామంలో పాట్లేళ్ల పోటీలు పోటాపోటీగ సాగాయి. 20 పాట్లేళ్లు పాల్గొన్నాయి. కాగా బుధవారం న్యూకేటగిరీ ఎద్దుల పోటీలు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీలను తిలకించేందకు రైతులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. వాఖ్యాతలుగా వేమారెడ్డి, శ్రీనివాసులు వ్యవహరించారు.



పోలకల్‌లో బండలాగుతున్న ఎద్దులు

చర్యలు తీసుకోండి

ఓర్వకల్లు: రైతుల పొలాలల్లో అక్రమంగా చేపడుతున్న విద్యుత్ టవర్ల నిర్మాణలపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మంగళవారం బాధిత రైతుల తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.రైతులు మాట్లాడుతూ మండలంలోని గుమ్మితం తండా సమీపంలో గ్రీన్‌కో సంస్థ వారు చేపడుతున్న భారీ సోలార్ పరిశ్రమకు అవసరమైన విద్యుత్ సరఫరా నిమిత్తం హుసేనాపురం, కాల్వ, ఓర్వకల్లు, తిప్పాయపల్లె గ్రామాలకు చెందిన రైతుల పొలాల్లో రైతుల అనుమతి లేకుండా విద్యుత్ లైన్ తీసుకెళ్తున్నారని, ప్రశ్నిస్తే దురుసుగా సమాధానమిస్తున్నారని వాపోయారు. మాజీ ఎంపీపీ లక్ష్మణరావు, మధుసూదన్‌రెడ్డి, మద్దిలేటిరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, మద్దిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

కోడుమూరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న గడిలో మాత్రమే 1వ నంబర్ వేయాలని, తర్వాత ఇష్టమైన వారు బరిలో 2,3,4 నంబర్లను వేయాలని సూచించారు. 1వ ప్రాధాన్యత ఓటు వేయకుండా ఇతర నంబర్లు వేస్తే ఓటు చెల్లదన్నారు. అలాగే పోలింగ్ బూత్‌లో సిబ్బంది ఇచ్చిన పెన్నుతో మాత్రమే ఓటు వేయాలన్నారు. ఈనెల13వ తేదీ ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు కర్నూలులోని ఆర్టీఓ ఆఫీస్‌లో ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

వైభవం..చెన్నసోమేశ్వర స్వామి రథోత్సవం

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీ చెన్న సోమేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం తెల్లవారు జామున వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.గ్రామంలో దాతల సహాయంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి గ్రామంలో పాత పెద్దమ్మ ఆలయం నుంచి బయలుదేరిన కుంభాన్ని ఊరేగింపుగా ఆలయం చేర్చారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని రథంపై అధిష్టింపజేశారు. భక్త జనం జయ జయ ధ్వానాల మధ్య, మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య రథాన్ని ముందుకు కదిలించారు. సాయంత్రం స్వామి వారి పారువేట కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు బీచుపల్లయ్య నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండ ఎస్‌ఐ పీరయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సంతానప్రాప్తి ప్రసాదం పంపిణీ కార్యక్రమం బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామని పూజారి చంద్రశేఖర్ శర్మ తెలిపారు. సంతానంలేని వారు భార్యభర్తలు జంటగా బుధవారం ఉదయం 8 గంటల లోపు ఎలాంటి ఆహారం తీసుకోకుండా ఆలయం చేరుకోవాలని ఆయన సూచించారు. అలాగే గ్రామంలో వసంతోత్సవం జరిపించి, సాయంకాలం పెద్ద బావిలో చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



పోలకల్‌లో వైభవంగా సాగుతున్న రథోత్సవం

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న జేసీ నిశాంతి.



సి.బెళగల్‌లో ఉద్యోగినులను సన్మానించిన అధికారులు

పాణ్యం: మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలని, ఇది సాధ్యపడాలంటే ముందు విద్యలో రాణించాలని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి తెలిపారు. మంగళవారం మండలంలోని నెరవాడ మెట్ట వద్దనున్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేసిన మహిళా దినోత్సవంలో జేసీ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఉపయోగించుకోని పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. ఐఈఈఈ హైదరాబాద్‌కు చెందిన సెక్టార్ చైర్‌పర్సన్ లక్ష్మీ ఎంపరింగ్ ఇన్‌చార్జ్ సోఫియా, డీన్ ఆశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

సి.బెళగల్: ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఎంపీడీఓ రాముడు తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండల మహిళా సమఖ్యా ఆధ్వర్యంలో వైకేపీ ఏపీఎం వెంకటస్వామి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ స్త్రీ ప్రాధాన్యతపై మాట్లాడారు. అంతకుముందు మండలంలోని వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగినులకు కార్యాలయంలో ఆటల పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్ఐ సౌమ్య, వీఆర్వో నాగమ్మ, పంచాయతీ కార్యదర్శులు సునీల్‌రాణి, మేరిథెరిస్సా, కంబదహాల్ ఎంపీటీసీ సభ్యురాలు శోభారాణి,ఎంఎంఎస్ సభ్యురాలు పద్మావతి, బ్యాంక్ అధికారిణి శారదబాయి, పొదుపు మహిళలను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

వేడుకగా హోలీ సంబరాలు

పాణ్యం: మంగళవారం సాయంత్రం నుంచే యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. మండలంలోని సుగాలిమెట్ట, కెఆర్‌ఆర్ తండాలో హోలి వేడుకలు జరునుకున్నారు.



సుగాలిమెట్టలో రంగులు చల్లుకుంటున్న దృశ్యం

సహాయకులను నియమించుకోండి

సి.బెళగల్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినయోగించుకునే సందర్భంలో సహాయకులను నియమించుకోవచ్చని ఎంపీడీఓ రాముడు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓటర్‌లైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ఓటువేసే విధానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నిరక్ష్యరాసులు, అంధులు, అస్వస్థతులు పోలింగ్ కేంద్రానికి రాలేని స్థితిలో ఉండే వారు ఈనెల 10వ తేదీలోపు జిల్లా కలెక్టర్‌ను సంప్రదించి సహాయకులను ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. అనంతరం ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో వివరించారు. ఈఓఆర్డీ సందీప్ ఇతర అధికారులు ఉన్నారు.